# బొమ్మ దొరికింది

రాత్రి ఒకటి అరాగా నక్షత్రాలు కళ్ళు తెరుస్తున్నాయి. కృష్ణమూర్తి కారు జోరుగా నడుపుతున్నాడు. పక్కనున్న పెళ్ళాంతో కబుర్లు చెప్తున్నాడు. పల్లవరంలో స్నేహితుల యింట భోజనంచేసి తిరిగి మాంబళం దారి పట్టించాడు కారు. వెనక సీటులో బాబిగాడు కునుకుతున్నాడు. ఎన్నడూ లేంది అమ్మమ్మ దగ్గిర ఉండకుండా "నేను వస్తా" నంటూ తయారయ్యాడు, ఎన్నో చెప్పిచూసి చివరికి పార్వతి సరే అని వాణ్ణి తయారుచేయక తప్పిందికాదు.

పార్వతికి పిల్లల పెంపకంలో కొన్ని నిబంధనలున్నాయి. అవి కనిపించకుండా సాయిలాపాయిలాగా పిల్లల్ని అడవి మొక్కలుగా పెంచినట్టు కన్పిస్తుంది. ఎంతవరకు వారిని మనస్సుకు డౌటురాదో అంతవరకే చెక్ చేస్తుంది. "ఈ అమ్మకి నే నంటే యిష్టంలేదు." అనుకునే పరిస్థితికి ఏ సంఘటన దిగజారనివ్వదు. ఒక్కొక్కప్పుడే కనబడని కట్టుదిట్టాలు పిల్లలకి కొమ్ములివ్వడం కద్దు. అయినా పార్వతి కో పద్ధతి ఉంది... దాని ఫలితమే ఈ రోజు బాబిగాడి విజిల్. "నేనూ వత్తా" నని వాడి హీరోతో సహా తయారయ్యాడు పార్వతి వాడలా

అడగ్గానే కరిగిపోతుంది. అయినా అటు అధునాతన స్నేహితుల యిల్లేమో పిల్లవాణ్ని తీసుకువెడితే బాగుండదేమో అని ఓ క్షణం తటపటాయించింది. ఈ వంకని పల్లవరం ప్రోగ్రాం కేన్సిల్ అయిపోయింది. హాయిగా బ్రిడ్జి ఆటకి పోవచ్చని లోలోన పొంగిపోయాడు కృష్ణమూర్తి.

కాని పార్వతి హాల్లోంచి ఫోన్‌లో మాట్లాడుతోంది. "బాబిగాడు గోలపెడుతున్నాడు పీలా కెన్ ఐ బ్రింగ్ హిమ్!" స్వీట్‌గా అడుగుతోంది.

హతోస్మి! అని లోన నీరసం ప్రకటించాడు కృష్ణమూర్తి. "ఓ థాంక్యూ...ఓ అరగంటలో అక్కడ ఉంటాం" అని ఫోన్ పెట్టేసింది పార్వతి.

పార్వతికేసి వింతగా చూస్తూ నిలబడిపోయాడు కృష్ణమూర్తి. "వాడు భోజనం దగ్గిర ఎంత హంగామా చేస్తాడో తెలుసుగా బాగుంటుందా!" అడిగాడు.

"ఇక్కడ అన్నం పెట్టేశానులే..." అంటూ భర్త నడుంమీద చెయ్యివేసి బెడ్ రూమ్‌లోకి దారితీసింది పార్వతి.

"అదికాదు కృష్ణా, వాణ్ని గట్టిగా వద్దంటం నాకిష్టం లేదు. మనతో కూడా వాడుండటం మనకి నామోషీ అనుకుంటే..."

"నీదంతా చాదస్తం పార్వతీ, పిల్లల్ని నాలుగు తన్ని యింట్లో కూర్చోపెట్టే వాళ్ళట!"

"మీ అమ్మా, నాన్నా రోజుల్లో ఆ పద్ధతి" నవ్వేసింది పార్వతి.

అలా జరిగి...బాబిగాడు పల్లవరం రావడం జరిగింది. కారు ఇంటిముందు ఆపి పెళ్ళానికి తలుపు తీశాడు కృష్ణమూర్తి. పార్వతి దిగగానే వెనక సీటులో బాబిగాణ్ని ఎత్తుకొని భుజాన వేసుకున్నాడు. వాడి మంచంలో వాణ్ని పడుకో బెట్టి, కారుతీసి గారేజీలో పెట్టి సుందర స్వప్నాలలో తేలిపోతూ తేలికగా యీలవేస్తూ పడక గదిలోకి అడుగు పెట్టాడు కృష్ణమూర్తి.

అప్పటికే చుట్టిన సిగవిప్పి తన పోట్టిజడ వేసుకుని తెల్లని చీరలో నిండు పున్నమిలాగా ఉంది పార్వతి.

"నువ్వు ఎక్కడికేనా వెళ్ళివచ్చిన రోజున ఉత్సాహంతో ఎంత కోరతగ్గ దానిలా వుంటావో తెలుసా పార్వతీ?" అంటూ ఆప్యాయంగా కౌగిట చేర్చుకున్నాడు భార్యని.

"నేను అలా అందరిలోకి ఓసారి వెళ్ళివచ్చిన రోజున నేను యింకా మనిషినే ఫరవాలేదు. నావిట్టూ హాస్యములు చచ్చిపోలేదు. సరదాగా చలాకీగా మాట్లాడగలను" అని జ్ఞాపకం వస్తుంది ముందు. ఆ పాతజ్ఞాపకం వర్తమానాన్ని ఉత్తేజితం చేసి మళ్ళీ యిలా నీ బానిసని చేస్తుంది" అంటూ భర్త ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకుని ముద్దెట్టుకుంది.

భార్యని కౌగలి వదలకుండానే లైటు ఆర్పబోయిన కృష్ణమూర్తికి షాకిచ్చినట్టు నిలబడి పోయాడు. గుమ్మంలో కళ్ళు నులుపుకొంటూ నిలబడివున్నాడు బాబిగాడు! జారిన కొంగు సర్దుకుని రెండంగలలో వెళ్ళి బాబిగాణ్ణి గుండెల

కద్దుకుంది పార్వతి. కృష్ణమూర్తికి క్షణంలో బాబిగాడంటే చాలా జలసీ వచ్చినమాట నిజమేగాని ఏం చేస్తాడు?

"ఏమ్మా లేచిపోయావేం?" ముద్దుగా అడిగింది కొడుకుని.

"నాహీరో" అన్నాడు.

"కార్లో బబ్బున్నాడు పొద్దున్నే లేపుదాం." అంది పార్వతి.

"నాక్కావాలి." అన్నాడు బాబిగాడు.

ఇక ఈ అర్గ్యుమెంటు అనంతం అని క్రిందికి దిగాడు కృష్ణమూర్తి. గారేజి తెరిచి కార్లో చూచాడు. హీరో లేదు. ఏందారి; అనుకుంటూనే ఈ వార్త భార్య చెవిన వేశాడు.

"లేపొస్తాడుట. ఇప్పుడు పడుకో బాబీ" అంది పార్వతి సమాధానంగా. వాడు ఏడుపు ప్రారంభించాడు. కృష్ణమూర్తికి చాలా చిర్రెత్తుకువచ్చింది.

"వెధవాయిని ఒక్కటంటించు. వాడే పడుకుంటాడు" అని కసురుకున్నాడు.

బాబిగాణ్ని తీసుకొని ప్రక్కగదిలోకి వెళ్ళిపోయింది పార్వతి. ఆ చీకట్లో కిటికీలోంచి కన్పిస్తున్న చుక్కలని లెక్కపెడుతూ పడుకున్నాడేగాని కృష్ణమూర్తికి నిద్రరాలేదు.

పక్క గదిలో పార్వతి కొడుక్కి ఏవేవో చెప్పి ఎలాగో నిద్రపో కొట్టింది.

రెండు కొడుతోంది. ఎక్కడో పాతకాలపు గడియారం. అప్పుడొచ్చింది పడక గదిలోకి. వచ్చీ రాన్నగా

మంచం దగ్గరికి రాలేదు పార్వతి. కిటికీ దగ్గర నిలబడి చీకట్లోకి చూస్తోంది లేచి వెళ్ళి కిటికీ దగ్గర ఆమె వెనక నిలబడి భుజాల మీద చేతులు వేశాడు.

వెనక్కు తిరిగి కృష్ణమూర్తి గుండెల్లో తలదాచుకుంటూ "నిన్నెంత ప్రేమిస్తున్నానో తెలుసా?" అంది.

"ఏదీ మళ్ళీ అను పార్వతి" అంటూ ఆవేశంగా కౌగలించుకున్నాడు.

కౌగిలి విడిపించుకుని "ఎందుకు?" అంది.

"నువ్వు మళ్ళీ మళ్ళీ అంటూంటే వినాలని, నువ్వలా అంటూంటే నాకు కొత్త ఊపిరి వస్తుందని నువ్వు అలా అంటూంటే నా గుండెలకి రెక్కలు వస్తున్నాయని..."

"పిల్లలకి అంతే కృష్ణా! ప్రేమకి ఎంతవద్దన్నా బాహ్య చిహ్నాలు కావాలనిపిస్తుంది. ఐ లవ్ యూ అని పదేపదే అనాలనీ, వినాలనీ అనిపించడం ఎందుకంటావు? సెక్యూరిటీ ఫీలవడం కోసం... పిల్లలకందుకే మనం ప్రేమ ప్రదర్శించడం వాళ్ళని ముద్దాడడం, ముచ్చట్లు తీర్చడం బాధ్యతలు కావు. మన గుండెలలోని కోర్కెల చిరునవ్వులు..." భర్త భుజం పై తలవాల్చింది పార్వతి. బాబిగాడి హీరోకి ఓ కన్ను లేదు కాళ్ళు చేతులూ వేళ్ళాడి పోయాయి. ఓ చెవి పీక్కుపోయి లోపలి నార కన్పిస్తుంది. అయితేనేం అది వాడి ప్రాణం. దాని కోసం వాడేడిస్తే మనం నవ్వకూడదు..." అంది.

భార్యని పడుకోమని చెప్పి కారు బయటికి తీశాడు కృష్ణమూర్తి. వచ్చినదారినే ఫ్లోమార్చిలాగా కారు పల్లవరం

వైపు నడిపించాడు. రోడ్లు నిశ్శబ్దంగా వున్నాయి. చెట్లమీద గబ్బిలాలు గోలగోలగా మాట్లాడుతున్నాయి. రోడ్డుని రెండు కళ్ళతో పరీక్షగా చూస్తూ ముందుకు సాగాడు కృష్ణమూర్తి. హీరో కోసం.

దారిలో దూరంగా బుల్సైఐ లాగా కారు దీపవు వెల్తురులో ఏదో మెరిసి ది. రోడ్డువారగా కారాపి ఆత్రంగా దిగాడు కృష్ణమూర్తి హీరో ఆ చీకట్లో రోడ్డుమీద పడుకుని కన్ను కొడుతున్నాడు. "ఆరి వెధవా" అంటూ బొమ్మని అప్యాయంగా పైకితీసి దుమ్ముదులిపాడు. ఎవరి కారో పై నుంచి పోయినట్లుంది. అసలే వేలాడుతున్న చేయి యింకా దిగజారిపోయింది.

హీరోని వెనక సీట్లో పడేసి ఉత్సాహంగా కారు వెనక్కు తిప్పాడు కృష్ణమూర్తి. బొమ్మ దొరికిందంటే చాలు! అనుకుంటూ ఆగమేఘాలమీద ఇల్లు చేరాడు.

శత్రువుల తలపాగా గుడ్డలు తెచ్చిన ఉత్తర కుమారునికి కల్గినంత గర్వం కలిగింది కృష్ణమూర్తికి. హీరోని చేత్తో పట్టుకుని మేడమీదికి వెళ్ళాడు.

కృష్ణమూర్తి వచ్చిన అలికిడికి పార్వతి లేచికూర్చుంది.

"దొరికిందోయ్ బొమ్మ!" అంటూ అమాంతం పార్వతిని కౌగలించుకున్నాడు. చేతిలో వేలాడుతున్న హీరో ఒంటి కన్ను చిలిపిగ కొట్టాడు. "వెధవాయి" అంటూ మంచంమీదికి విసిరాడు వాణ్ణి.

"నిన్ను నేను ప్రేమిస్తున్నాను పార్వతీ. నీ కెన్నోసార్లీ మాట ఎన్నో రకాలుగా చెప్పాలని-కాని నవ్వుతావేమో,

అని భయం వేసింది. "ఏమిటీ వేషాలు ఓ పక్క వయసు మళ్ళిపోతుంటే" అని తోసేస్తావేమో అనిపించి ఊరుకున్నాను" అన్నాడు. "ఈ రోజు నాకా ధైర్యం వచ్చింది..."

"వయసు ముదిరితే మనస్సు ముదరాలేమిటి? మనం నిత్య యౌవ్వనులం కృష్ణా—" అంది భర్తని కౌగలించుకుంటూ.

"నువ్వు బరితెగించిన ఆడదానివిలా వున్నావు. యిలా ఎవరైనా కౌగలించుకుంటారా!" అని వేళాకోళం చేశాడు కృష్ణమూర్తి కౌగిలిని వదలనీయకుండానే.

"ఇదే బరితెగించడం అయితే ఎంతమంది స్త్రీలు చేస్తే అన్ని సంసారాలు స్వర్గానికి నిచ్చెన లెత్తుతాయిలే" అంటూ లైటార్పింది పార్వతి.

మంచంమీద పడివున్న హీరో అదే క్షణంలో నేల మీద పడ్డాడు.

అయినా బటన్ ఐ చిలిపిగా కొడుతూనే ఉన్నాడు "నిన్న రేపు రిపేరు చేస్తాలే" అని అంది పార్వతి.

"వీన్నో కంట కనిపెట్టడం మంచిదిలే" అని అనుకున్నాడు కృష్ణమూర్తి చిదానందంగా నేలమీదపడి ఉన్నాడు ఒంటికంటి హీరో.

---